సాక్షి అనకాపల్లి

ఆదివారం । 26 । నవంబర్ । 2023



గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

విశాఖ: గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో శనివారం రాష్ట్రస్థాయి చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.



వెంకన్నకు పూజలు

విశాఖ: కార్తీక రెండో శనివారం బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు.



పుస్తక మహోత్సవం

విశాఖ: విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాన్ని స్థానిక టర్నర్ సత్రంలో శనివారం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

సరైన పంటల ఎంపికతో రబీలో లాభాలు



మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి టౌన్: అనువైన రకాల ఎంపిక, సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రబీ పంటలో లాభాలు పొందవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ ఏఆర్ఎస్) ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం వ్యవసాయ టీఎన్వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో వివిధ పంటల్లో దిగుబడులు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. నైరుతి రుతుపవనాల ద్వారా సాధారణం కంటే 34 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు ఆయన తెలిపారు. ఈ కారణంగా జిల్లా వ్యాప్తంగా 30 నుంచి 40 శాతం విస్తీర్ణంలో పంటలు వేయలేదని, ఈ మేరకు దిగుబడులు తగ్గే అవకాశముందన్నారు. రబీ సీజన్‌లో పెసర, మినుము, చోడి, జనుము, నువ్వులు, వేరుశనగ పంటలను సరైన యాజమాన్య పద్ధతుల్లో పండిస్తే దిగుబడి లాభదాయకంగా ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలు ముకుందరావు, విశాలాక్షి, రామలక్ష్మి, ఎం.బి.జి.ఎస్.కుమారి, డి.ఉమామహేశ్వరరావు, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీగా ఆచార్య సమత బాధ్యతల స్వీకరణ



సమతకు రిజిస్ట్రార్ స్టీఫెన్ అభినందనలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ కార్యాలయంలో కలిసి అభినందించారు. విభాగాధిపతులు, డీన్‌లు, ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి గింజకూ భరోసా

ఖరీఫ్ సీజన్ తుది దశకు చేరింది. జిల్లాలో వరి చేను కోతలు జోరందుకున్నాయి. కొన్ని చోట్ల పంట నూర్పిడి కూడా జరుగుతోంది. దీంతో రైతులు విక్రయానికి సిద్ధం చేసిన ప్రతి గింజనూ కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. 72 ఆర్బీకేలను ధాన్యం కొనుగోలు క్లస్టర్లుగా మార్చింది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అదనపు సిబ్బందిని నియమించింది.

- ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం
- క్లస్టర్లలో అదనపు సిబ్బంది ఏర్పాటు



ట్రాక్టర్ ఫ్యాన్ సాయంతో ధాన్యం గాలిపోస్తున్న రైతులు

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమయింది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. తొలి విడతలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందుకు 26 రైస్ మిల్లర్లను గుర్తించి, అనుమతులు మంజూరు చేశారు. వీరు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చి, కొనుగోళ్లు జరపడమే ఇక తరువాయి.

కొనుగోలు క్లస్టర్లుగా 72 ఆర్బీకేలు

జిల్లాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు 72 రైతు భరోసా కేంద్రాలను క్లస్టర్లుగా ప్రకటించారు. ఆయా క్లస్టర్లలో ధాన్యం విక్రయాల సమయంలో రైతులకు ఇబ్బందుల్లేకుండా అదనపు సిబ్బందిని నియమించారు. ఒక్కో క్లస్టర్‌కు అదనంగా టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ డేటా ఆపరేటర్, సహాయకులను నియమించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యేల అభీష్టం మేరకు ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నారు. ఆర్బీకేలతో పాటు వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) కూడా ధాన్యం కొనుగోలు చేయనున్నాయి.

భారం, బాధ్యత ప్రభుత్వానిదే

ధాన్యం సేకరణలో రైతులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా రవాణా చార్జీలు, హమాలీలు, కూలీల ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుంది. ధాన్యాన్ని రైతుల కల్లాల నుంచి మిల్లర్ల వరకు రవాణా చేసేందుకు జిల్లాలో 250 ట్రాక్టర్లను ప్రభుత్వం సమకూర్చింది. ఎవరైనా తమ సొంత వాహనం సమకూర్చుకుంటే దూరాన్ని బట్టి అద్దె సొమ్ము రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుంది. ధాన్యం సేకరణకు జిల్లాలో 8 లక్షల గోనె సంచుల సరఫరాకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే 3 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉండగా, మిగతా సంచుల్ని సమకూర్చుకునే పనిలో రైస్ మిల్లర్లు ఉన్నారు.



తాండవ రిజర్వాయర్ పరిధిలో కోత దశలో వరిచేను

జిల్లాల్లో ధాన్యం కొనుగోలు జరిగే క్లస్టర్లు	72
ధాన్యం సేకరణ అనుమతులు పొందిన మిల్లర్లు	26
కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు ట్రాక్టర్లు	250
ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు	8 లక్షలు
ఇప్పటికే సిద్ధంగా ఉన్న గోనె సంచులు	3 లక్షలు
100 కిలోల గ్రేడ్-ఎ ధాన్యం మద్దతు ధర	రూ.2,203
100 కిలోల గ్రేడ్-బి ధాన్యం మద్దతు ధర	రూ.2,183

21 రోజుల్లో చెల్లింపులు

ధాన్యానికి ఏ, బీ గ్రేడ్లుగా మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు కొనుగోలు చేసిన ధాన్యానికి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకే 21 రోజుల్లోగా చెల్లింపులు చేయనుంది. ఈ ఏడాది కొత్తగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ధాన్యం రవాణా చేసేందుకు ప్రభుత్వం అద్దెకు తీసుకున్న ట్రాక్టర్లకు జీపీఎస్ పరికరాలను అమర్చనున్నారు.

గతంలో జరిగిన అవకతవకలు, ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈ జాగ్రత్తలు తీసుకుంటోంది. జిల్లా స్థాయిలో జేసీ ఆధ్వర్యంలోను, మండల స్థాయిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఆ దిశగా ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. కొ నుగోలు కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. జిల్లాలో గుర్తించిన కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని నియమించాం.

– పి.జయంతి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్

దేవరాపల్లిలో ముందుగా కోతలు



ఖరీఫ్ సీజన్‌లో వరి చేలు దేవరాపల్లి మండలంలో ముందుగా పంట దశకు వచ్చాయి. దీంతో అక్కడే తొలుత కోతలు మొదలయ్యాయి. డిసెంబర్ మొదటి వారానికి జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వరి కోతలు జరుగుతాయి. వాతావరణ పరిస్థితి బాగుంటే తాండవ రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో కోతలు కాస్త ఆలస్యంగా ఉంటాయి.

– బి.మోహనరావు, వ్యవసాయశాఖ జేడీ, అనకాపల్లి జిల్లా

9న జాతీయ లోక్‌అదాలత్





సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్, హాజరైన పోలీసు సిబ్బంది

చోడవరం రూరల్: వచ్చే నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ న్యాయవాదులు, పోలీసు సిబ్బందిని కోరారు. లోక్ అదాలత్ సన్నాహక సమావేశాన్ని శనివారం స్థానిక కోర్టుల సముదాయంలోని 9వ అదనపు జిల్లా కోర్టులో నిర్వహించారు. సాధ్యమైనంత మేరకు కేసును రాజీ చేయాలన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన కోరారు. లోక్‌అదాలత్‌లో కేసుల్ని పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ సత్తి అరుణశ్రీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల్ని పరిష్కరించడానికి ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని కోరారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- స్వగ్రామానికి వెళుతుండగా కబళించిన మృత్యువు



శీర ఈశ్వరరావు, దేముడమ్మ (ఫైల్)

మర్రిపాలెం (విశాఖ): రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. ఈ ఘటన శనివారం కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో శీర ఈశ్వరరావు (55) వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నాడు. శనివారం 9.15 గంటలకు భార్య దేవుడమ్మ (50)తో కలిసి స్కూటీపై సొంతూరు దేవరాపల్లి మండలం రైవాడ బయలుదేరాడు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో ఎదురుగా వస్తున్న కారు స్కూటీని ఢీకొనడంతో ఇద్దరూ కిందపడిపోగా తీవ్రగాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన కేజీహెచ్‌కి తరలించారు. ఈశ్వరరావు అప్పటికే మృతి చెందగా, భార్య దేవుడమ్మ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని వారి కుమార్తె కోరాడ ఆదిలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈశ్వరరావు హెల్మెట్ ధరించి ఉన్నా ఇలా జరగడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ కేసును ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైవాడలో విషాదఛాయలు

దేవరాపల్లి: శీర ఈశ్వరరావు దంపతుల దుర్మరణంతో వారి స్వగ్రామం రైవాడలో విషాదం నెలకొంది. వారు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం విశాఖపట్నం వెళ్లారు. అంజనేయస్వామి మాల ధరించిన ఈశ్వరరావు తన భార్య దేముడమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వస్తుండగా ఈ దారుణం జరిగింది. రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలిద్దరూ మృతి చెందారు. వీరికి వివాహితురాలైన ఒక కుమార్తె ఉంది. తల్లిదండ్రులు ఒకేసారి మరణించడంతో కుమార్తెతోపాటు కుటుంబ సభ్యులు విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. మృతదేహాలకు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామం రైవాడకు తీసుకువచ్చారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరి మృతికి వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవాని, సర్పంచ్ చల్లా లక్ష్మి, ఉగ్రాకుల అప్పారావు, చల్లా నాయుడు తదితర్లు సంతాపం ప్రకటించారు.



సంఘటన స్థలంలో ఈశ్వరరావు మృతదేహం

జనమే జనం



పెందుర్తి నియోజకవర్గం సబ్బవరంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభకు హాజరైన జనసందోహం

- పెందుర్తి నియోజకవర్గంలో వెల్లువెత్తిన సామాజిక చైతన్యం
- సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం
- జగన్నినాదంతో మార్మోగిన సభా ప్రాంగణం

పెందుర్తి / సబ్బవరం: సబ్బవరం జన సంద్రమైంది.. ఎటు చూసినా జనమే.. అందరి ముఖాల్లో ఆనందం .. అంతటా జగన్నినాదం.. సబ్బవరంలో శనివారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు భాగస్వాములయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆయా వర్గాలకు చేసిన మేలును స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వివరిస్తుంటే.. జనం చప్పట్లతో పెద్ద ఎత్తున స్వాగతించారు. జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలు చేస్తూ తమ మద్దతును గట్టిగా ప్రకటించారు. మొత్తానికి సబ్బవరంలో జరిగిన యాత్ర జన సునామీని తలపించింది.

- సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా పెందుర్తి నియోజకవర్గం వేపగుంట కూడలి వద్ద వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు నందిగం సురేష్, డాక్టర్ భీశెట్టి సత్యవతి, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, పెట్ల ఉమాశంకర్ గణేష్, పార్టీ విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్‌లను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సారథ్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.
- వేపగుంట కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వేపగుంటలో డిప్యూటీ సీఎం బూడి, మంత్రి గుడివాడ, ఎమ్మెల్యేలు ప్రెస్‌మీట్ నిర్వహించారు.
- ప్రభుత్వం మంజూరు చేసిన రూ.8 కోట్ల నిధులతో పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్మించిన అదనపు భవనాన్ని నాయకులు ప్రారంభించారు.
- భోజన విరామం అనంతరం పినగాడి, చిన్నయ్యపాలెం, సబ్బవరం పాతరోడ్డు, జోడుగుళ్ల మీదుగా రోడ్డకిరువైపులా బారులు తీరిన ప్రజలకు అభివాదం చేస్తూ.. నాయకులు సబ్బవరం మూడు రోడ్ల కూడలిలోని సభావేదిక వద్దకు చేరుకున్నారు. సభావేదిక మీదకు వెళుతున్న నాయకులపై ప్రజలు పూల వర్షం కురిపిస్తూ ఘనంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ యువత 'గిరా గిరా తిరుగుతుంది ఫ్యాన్' సాంగ్‌కు ప్రదర్శన చేసి అందరినీ ఉత్తేజపరిచారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు





ప్రజాప్రతినిధులపై పూలవర్షం, పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు

సీఎం జగన్‌తో సామాజిక సాధికారత

సబ్బవరాన్ని జన సముద్రం ముంచెత్తింది. అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.30 లక్షల కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాం. గత టీడీపీ ప్రభుత్వం బీసీలను వాడుకుని మోసం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సాధికారతకు కొత్త అర్థం చెప్పారు. రాజకీయ, నామినేటెట్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సమాన అవకాశాలు కల్పించారు.

– కరణం ధర్మశ్రీ, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

ప్రభుత్వానికి మద్దతు తెలిపేందుకు సామాజిక సాధికార యాత్రకు వచ్చిన మిమ్మల్ని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. రాష్ట్రంలో కొత్తగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్ర భవిష్యత్ కోసం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలి.

– భీశెట్టి వెంకట సత్యవతి, అనకాపల్లి ఎంపీ

నేవీ డేకు పటిష్ట భద్రత

దొండపర్తి(విశాఖ): నేవీ డే సందర్భంగా డిసెంబర్ 4వ తేదీన బీచ్ రోడ్డులో జరిగే వేడుకలకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో నేవీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. నేవీ డే సందర్భంగా నగరానికి పలువురు వీవీఐపీలు వచ్చే అవకాశం ఉండడంతో వారి భద్రతతోపాటు వేడుకలకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, వీఐపీ కాన్వాయ్‌లు, వాటిని నిలిపే ప్రాంతాలు, అధికారులు, సిబ్బంది వసతి ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షించారు.

క్లుప్తంగా

రామాలయానికి వెండి ఆభరణాల బహూకరణ



స్వామివార్లకు వెండి ఆభరణాలు సమకూర్చిన దాతలు

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి సీతా రామలక్ష్మణ, ఆంజనేయ స్వామివారికి రూ.1.56 లక్షల విలువ చేసిన వెండి ఆభరణాలను గ్రామానికి చెందిన దొగ్గ మురళీ దంపతులు శనివారం బహూకరించారు. వీటిని ఆలయ పురోహితుడు ఫణీంద్ర వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివార్లకు అలంకరించారు. ఈ సందర్భంగా మురళీ కుటుంబ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

జలపాతం వద్ద జారిపడిన యువకుడు

- తీవ్రంగా గాయంతో పీహెచ్‌సీకి తరలింపు



చికిత్స చేస్తున్న సిబ్బంది

అనంతగిరి : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగూడ జలపాతం వద్ద శనివారం ప్రమాదశాత్తూ జారిపడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చారు. తాటిగూడ జలపాతాన్ని తిలకిస్తుండగా ప్రియరంజన్‌విశ్వ (20) అనే యువకుడు ప్రమాదవశాత్తూ జారిపడడంతో తలకు తీవ్రం గాయమైంది. వెంటనే స్నేహితులు అతనిని ఆటోలోని స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యసిబ్బంది చికిత్స అందించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ సర్వేయర్ మృతి

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి ప్రభుత్వ పాలిటెక్నిక్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ సర్వేయర్ మృతి చెందాడు. టౌన్ ఎస్సై సుధాకర్ వివరాల ప్రకారం.. నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామానికి చెందిన జి.రాజ్‌కుమార్(20) ప్రైవేట్ సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. సర్వే పనుల నిమిత్తం గొలుగొండ మండలం వెళ్లి తన బైకుపై వస్తున్నాడు. పాలిటెక్నిక్‌కు దగ్గరకు వచ్చే సరికి ముందు వెళ్తున్న ఆటోను ఓవర్ టేక్ చేసే క్రమంలో తన బైక్ కట్టిన సర్వే లింకులు వేసే పొడవాటి ఊచ ఆటో రాడ్డుకు తగలడంతో ఈ ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కల్యాణ మండపానికి శ్రీకారం



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్ దంపతులు, ఎంపీ సత్యవతి దంపతులు



మహిళల కోలాట ప్రదర్శన

- కశింకోటలో నూకాంబిక ఆలయం వద్ద రూ.50 లక్షలతో నిర్మాణం
- శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ

కశింకోట: మేజర్ పంచాయతీ కశింకోటలో నూకాంబిక ఆలయం వద్ద రూ.50 లక్షలతో కల్యాణ మండపం నిర్మాణానికి డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి దంపతులు శనివారం శంకుస్థాపన చేశారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం నూకాంబిక ఆలయంలో వీరు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివగణేష్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరికి ముందుగా జాతీయ రహదారి నుంచి శంకుస్థాపన వేదిక వరకు మేళ తాళాలు, పెద్ద ఎత్తున బాణసంచాతో స్వాగతం పలికారు. ఇదే సమయంలో మహిళల కోలాటాలు, తప్పెటగుళ్లు, తోడపెద్ద సేవలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ 20 వేల జనాభా కలిగిన కశింకోటలో పెద్ద కల్యాణ మండపం ఉండాలనే సంకల్పంతో దీని నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇప్పటికే అనకాపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కల్యాణ మండపాల నిర్మాణం చేపట్టామన్నారు. ఎంపీ మాట్లాడుతూ కశింకోట అభివృద్ధిలో భాగంగా రూ.కోటి వెచ్చించి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సామాజిక భవనం, సిమెంట్ రోడ్లు, తదితర పనులను నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాటర్ వేస్ అథారిటీ సంస్థ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదవాడి మేలు కోసం మోదీ సంక్షేమ పథకాలు

- పార్టీ సంస్థాగత అంశాలపై దృష్టి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దగ్గుబాటి పురందేశ్వరి

తుమ్మపాల: సబ్కా సాత్, సబ్కా వికాస్ నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, దేశంలో ప్రతి పేదవాడు అభివృద్ధి చెందాలన్నదే ఆయన లక్ష్యమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. పట్టణంలో పెంటకోట కన్వెన్షన్ హాల్లో బీజేపీ జిల్లా స్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రం అందిస్తున్న ప్రతి పథకంలోనూ కేంద్ర నిధులు ఉన్నాయన్నారు. జిల్లాలో ఏడు కోట్ల నిధులతో బొజ్జన్న కొండ అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.17 కోట్లతో అనకాపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతుందన్నారు. విశాఖ-అనకాపల్లి, అనకాపల్లి-పెందుర్తి రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ప్రతి జిల్లాలో సమావేశాలు నిర్వహిస్తున్నానని, ప్రతి జిల్లాలో సంస్థాగత అంశాలపై దృష్టి సారించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎస్.కాశీవిశ్వనాథరాజు, జనరల్ సెక్రెటరీ సీతా రామాంజనేయ చౌదరి, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ ఈర్లె శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అంధుల క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కొమ్మాది: వచ్చే ఏడాది జనవరిలో హుబ్లీలో జరగనున్న జాతీయ స్థాయి అంధుల క్రికెట్ పోటీలకు బీచ్ రోడ్డులోని అంధ బాలికల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తిరుమల ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ అంధుల క్రికెట్ టీమ్ ఎంపిక పోటీల్లో ఇక్కడ విద్యార్థినులు రాజేశ్వరి, చంద్రకళ, సారిక, సుజాత అర్హత పొందినట్లు పేర్కొన్నారు.

హాకీ టోర్నీ ప్రారంభం



విశాఖ స్పోర్ట్స్: పాఠశాలల హాకీ టోర్నీలో భాగంగా తొలి రోజు జరిగిన పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల జట్లు విజయం సాధించాయి. రైల్వే న్యూకాలనీ ప్రభుత్వ పాఠశాల 4–0 గోల్స్‌తో సింహాచలం ఉన్నత పాఠశాలపై విజయం సాధించింది. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 0–3తో ఇస్లాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో మ్యాచ్‌లో పరాజయం పాలయినా 0–5తో మధురవాడ ఎస్ఎఫ్ఎస్ పాఠశాలపై విజయం సాధించింది. ఫ్రెండ్స్ హాకీ సంఘం, హాకీ విశాఖ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుల్లయ్యకళాశాలలో జరుగుతున్న ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్‌కే చక్రవర్తి ప్రారంభించారు. ఈ పోటీల్లో బాలురు ఎనిమిది జట్లు, బాలికలు నాలుగు జట్లు పాల్గొంటున్నాయి.

పుణ్యనదీ హారతి రేపు

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 5.30 గంటలకు వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కొండదిగువ వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణి గట్టుపై దీపాలు వెలిగిస్తారన్నారు. ప్రమిదలు, వత్తులు, నూనె దేవస్థానమే ఉచితంగా అందిస్తుందన్నారు.

1,986 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యానికి నమోదు

- జిల్లా సూక్ష్మసాగు నీటివనరుల ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి



మాట్లాడుతున్న సూక్ష్మ సాగు నీటి వనరులు ప్రాజెక్టు డైరెక్టరు లక్ష్మి

నాతవరం: జిల్లాలో ఈ ఏడాది బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యానికి మించి విస్తరించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని సూక్ష్మసాగు నీటి వనరుల ప్రాజెక్టు డైరెక్టరు జి.వి.లక్ష్మి తెలిపారు. శనివారం నాతవరంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది 1,200 హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకోగా, ఇంత వరకు 1,986 హెక్టార్లకు రైతులు నమోదు చేసుకున్నారన్నారు. వాటిలో 1,006 హెక్టార్లలో క్షేత్రస్థాయి పరిశీలన చేశామన్నారు. 560 హెక్టార్లకు కలెక్టరు నుంచి అనుమతులు వచ్చాయన్నారు. 350 హెక్టార్లకు మెటీరియల్ సరఫరా చేశామన్నారు. డ్రిప్ ఏర్పాటుకు ఐదెకరాల లోపు రైతుకు 90 శాతం, ఆపై భూమి ఉంటే 50 శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. స్ప్రింకర్ల సేద్యానికి ఐదెకరాలకు 55 శాతం, ఆపై ఉన్న రైతులకు 45 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. గతేడాది 850 హెక్టార్లకు మాత్రమే సాగు చేశామన్నారు. నీటి సదుపాయం ఉన్న రైతులంతా ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, జేఈలు రాజేష్, జోగారావు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులరెడ్డి

నర్సీపట్నం: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి పేర్కొన్నారు. సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నర్సీపట్నం బాలికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ భావాలను వ్యతిరేకించాలన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. చదువుకున్న వారు సైతం మూఢ నమ్మకాల బారిన పడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అనంతరం మెజీషియన్ శ్రీరాములు మ్యాజిక్ షో ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. మాకవరపాలెం ఎంఈవో బి.అచ్చుతరామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి తాపీమేస్త్రి మృతి

- ముకుందపురంలో విషాద ఛాయలు





కర్రి లక్ష్మీరావు మృతదేహం, లక్ష్మీరావు (ఫైల్)

మాడుగుల రూరల్: తాపీ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి తాపీమేస్త్రి కర్రి లక్ష్మీరావు(50) మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ సిహెచ్. పెద్దయ్య కథనం ప్రకారం.. మండలంలో ముకుందపురం గ్రామానికి చెందిన లక్ష్మీరావు ఈ నెల 22న చీడికాడ మండలం అప్పలరాజుపురంలో తాపీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. అప్పటి నుంచి ఆయన గురించి కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం వెళ్లే మార్గంలో పరిదేశమ్మ తల్లి పాదాలు వెనుక భాగం పొలంలోని నీటి కుంటలో మృతదేహం తేలియాడింది. అక్కడకు చుట్టుపక్కల వారు గడ్డి కోతకు వచ్చి చూసి, వీఆర్వో కాళింగ పెదబాబుకు చెప్పారు. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లక్ష్మీరావు భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పంచనామా చేసి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె భవానీకి స్వగ్రామంలోనే వివాహం కుదిరింది. పెళ్లి ముహూర్తం పెట్టుకోవడానికి నిర్ణయించుకున్నారు. ఇంతలో ఈ ఘోరం జరిగిందని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

ధారాలమ్మ ఘాట్‌లో కారు బోల్తా

- ఇద్దరికి తీవ్ర గాయాలు

సీలేరు: ధారకొండ పంచాయతీ, ధర్మాపురం ఘాట్‌లో కారు అదుపు తప్పి లోయలోకి బోల్తా కొట్టింది. గాలికొండ పంచాయతీలో సెల్ టవర్ల పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో కారులో ఏడుగురు ప్రయాణికులు ఉండగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మార్గంలో వెళ్తున్న కాఫీ రైతులు ప్రమాదాన్ని గుర్తించారు. వెంటనే కారులో ప్రయాణికులను బయటకు తీసి ధారకొండ పీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ సాల్మన్, పురాఖాన్‌ను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు వైద్యాధికారి హిమబిందు తెలిపారు.

క్లుప్తంగా

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్‌: జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సీహెచ్‌. పావని కోరారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ నుంచి ఎన్టీఆర్‌ క్రీడామైదానం వరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్రీడామైదానంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాతృభాషకు విద్యార్థులు దూరం కాకుండా చూడాలన్నారు. మహిళలపై లైంగికదాడుల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు శంకరరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌.రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గీతా కృష్ణ, డీవైఎఫ్‌ఐ నాయకులు సీహెచ్‌.శివాజీ, బాలాజీ, రామేశ్వరరావు, రమ్య, పూజిత, స్వరూప, కార్తీక్‌, కేశవ, ప్రసాద్‌ పాల్గొన్నారు.

నేడు నాలుగు మండలాల్లో వికసిత్‌ భారత్‌ సంకల్పయాత్ర

తుమ్మపాల: జిల్లాలో నాలుగు మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లో ఈ నెల 26న వికసిత్‌ భారత్‌ సంకల్పయాత్ర జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఓ ప్రకటనలో తెలిపారు. మాడుగుల మండలంలో డి.గొటివాడ, సగరం, అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెం, మారేడుపుడి, యలమంచిలి మండలంలో పి.ఎస్‌.ఆర్‌ పేట, ములకపల్లి, నర్సీపట్నం మండలంలో వేములపూడి, మెట్టపాలెంలలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

బొజ్జన్న కొండ వద్ద సౌకర్యాలు కల్పించాలని వినతి

అనకాపల్లిటౌన్‌: మండలంలో బొజ్జన్నకొండకు వచ్చే పర్యాటకులకు మౌలికసదుపాయాలు కల్పించడంతో పాటు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని సిద్ధార్థసోషల్‌ సర్వీస్‌ అండ్‌ కల్చరల్‌ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏ.జె.చిన్నికృష్ణకు శనివారం అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్‌గుప్త, కార్యవర్గసభ్యులు పట్నాల కృష్ణమోహన్‌, బుద్ధిస్ట్‌ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నెలపూడి బాలరాజు, దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూక అప్పారావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 3,533 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్‌ రకం	4,360	4,700
మొదటి రకం	3,850	4,350
రెండో రకం	3,700	4,090
మూడో రకం	3,370	3,700

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
మా ఊరి పొలిమేర-2	: సత్యనారాయణస్క్రీన్‌-1
స్పార్క్‌	: సత్యనారాయణస్క్రీన్‌-2
జిగర్‌ తండ	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్‌పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్‌: జిల్లా ఎన్టీఆర్‌ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌-4 యూనిట్లు, బి పాజిటివ్‌-5 యూనిట్లు, బి నెగిటివ్‌-1యూనిట్‌, ఓ పాజిటివ్‌-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్‌-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్‌(ఫోన్‌ నంబర్‌ 9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్‌ సమాచారం

అనకాపల్లిటౌన్‌ : ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ద్వారా శనివారం 411 మంది గ్యాస్‌ బుక్‌ చేసుకున్నారు. గతంలో బుక్‌ చేసుకున్న వారిలో 384 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్‌ ఏజెన్సీ(ఫోన్‌ నంబర్‌08924223595)ని సంప్రదించవచ్చు.

ఆనంద లోగిళ్లు




నా పేరు వారాది కృష్ణమ్మ. రేబాక గ్రామంలో నివసిస్తున్నాను. ఒంటరిగా జీవిస్తున్నాను. నా సోదరుడి ఇంటిలో ఉండే నాకు సొంతిల్లు లేదని గుర్తించి, మా గ్రామంలోనే స్థలంలో మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఇప్పుడు నేను నా ఇంటిలో స్వేచ్ఛగా ఉంటున్నాను. నా ఇంటికి విద్యుత్‌, మంచినీటి సౌకర్యం కల్పించారు. రోడ్డు కూడా వేశారు. ఎప్పటికప్పుడు బిల్లులు పెండింగ్‌ లేకుండా నా బ్యాంకు ఖాతాలో జమ చేశారు. నా లాంటి వారి సొంతింటి కల సాకారం చేసిన జగనన్నే మళ్లీ సీఎం కావాలి.



నా పేరు పేరు కరణం పుష్పావతి, నా భర్త ఆటో డ్రైవర్‌, మాకు ఇద్దరు ఆడ పిల్లలు. అనకాపల్లి మండలం శంకరం గ్రామంలో ఉంటున్న మాకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంటిలో చాలా ఇబ్బందులు పడేవారం. జగనన్న ప్రభుత్వం వచ్చాక మాకు ఇల్లు లేని విషయం గుర్తించి, జగనన్న లేఅవుట్‌లో నాపేరుపై ముందుగా స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షల నగదు అందించారు. డ్వాక్రా ద్వారా రూ.30 వేలు వడ్డీ లేని రుణం ఇచ్చారు. దీంతో శరవేగంగా ఇంటి నిర్మాణపనులు పూర్తిచేసుకోగలిగాం. మా ఇంటికి విద్యుత్‌, మంచినీటి సౌకర్యం కల్పించారు. చక్కని వాతావారణంలో మంచి ఇంటిని నిర్మించుకున్నాం. చాలా ఆనందంగా ఉంది. మేం ఎప్పుడూ జగనన్నకు రుణపడి ఉంటాం. మళ్లీ జగనన్నే సీఎం కావాలి.

పేదలందరికీ ఇళ్లు సమకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. వారి సొంతింటి కల నెరవేర్చింది. ఒక్కో లబ్ధిదారుకు సెంటున్నర స్థలం ఉచితంగా ఇచ్చి, అందులో పక్కా గృహం నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణానికి శ్రీకారం చుట్టి శరవేగంగా పూర్తి చేస్తున్నారు. చాలా మంది గృహ ప్రవేశాలు చేశారు. సొంతిల్లు సమకూరడంతో వారి ఆనందానికి అవధులు లేవు.





కొత్త ఊరుగా మారిన జగనన్న లేఅవుట్‌, (ఇన్‌సెట్‌) పూర్తయిన నూతన గృహం

పేదల సొంతింటి కలను సాకారం చేసిన జగనన్న ప్రభుత్వం

గ్రామాలను తలపించేలా జగనన్న కాలనీలు

శరవేగంగా నిర్మాణాలు

హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



తుమ్మపాల: అనకాపల్లి మండలంలో జగనన్న లేఅవుట్‌లు ఊళ్లను తలపిస్తున్నాయి. ఆ లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్‌, నీరు, ఇతర అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎదురైన ఆటంకాలను అధికారులు వెంటనే పరిష్కరిస్తూ లబ్ధిదారులకు అండగా నిలుస్తున్నారు.

ఏకంగా ఊళ్ల నిర్మాణం

మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 43 జగనన్న లేఅవుట్‌లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రభుత్వ స్థలాలు లేని కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు భూములు కొనుగోలు చేసి పేదలకు అందజేశారు. భారీ ఎత్తున స్థలాలు మంజూరు చేయడంతో జగనన్న లేఅవుట్లు ఊళ్లను తలపిస్తున్నాయి. మండలంలో మొత్తం 2,697 మంది అర్హులకు గృహాలు మంజూరు చేశారు. కరోనా, తరువాత వర్షాల కారణంగా మందకొడిగా సాగిన నిర్మాణాలు ఇప్పుడు శరవేగంగా సాగుతున్నాయి. 1905 ఇళ్ల పునాదులు పూర్తయ్యాయి, గోడల నిర్మాణం జరుగుతోంది. 257 గృహాలకు శ్లాబులు పూర్తవగా, ఇప్పటికే 535 ఇళ్లలో లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసి, నివాసముంటున్నారు. డిసెంబర్‌ నెలాఖరు నాటికి మరో 350 గృహాలను ప్రారంభించేందుకు లబ్ధిదారులు సిద్ధపడుతున్నారు. మిగిలిన గృహాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మార్చి నాటికి పూర్తిచేసేలా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.

లేఅవుట్‌లలో మౌలిక సౌకర్యాలు

వైఎస్సార్‌ జగనన్న లేఅవుట్‌లలో రోడ్లు, విద్యుత్‌, మంచినీరు, డ్రైనేజీ తదితర మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించింది. ఇప్పటికే అన్ని లేఅవుట్‌ల వద్ద బోర్లు వేశారు. నిర్మాణపనులు ప్రారంభించిన ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటుచేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో విద్యుత్‌ సౌకర్యం కల్పించారు. అంతర్గత రోడ్ల నిర్మాణంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

సొంత స్థలాల్లోనూ మంజూరు

సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు అందిస్తున్నారు. మండలంలో ఇప్పటికి 310 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయి. సొంతస్థలాలు ఉన్నవారిలో 77 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. పనులు చేస్తున్న వారికి వెంటనే బిల్లులు చెల్లిస్తున్నారు.

మండలం : అనకాపల్లి

లేఅవుట్లు	మంజూరైన ఇళ్లు
43	2,697
నిర్మాణాలు పూర్తయినవి	600
స్వంత స్థలాల్లో మంజూరైన ఇళ్లు	310

సర్పంచ్‌ కుటుంబానికి మంత్రి పరామర్శ



గణేష్‌ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌

కశింకోట: మండలంలోని మోసయ్యపేట సర్పంచ్‌ మిస్కా రాజేశ్వరి కుటుంబాన్ని శనివారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ పరామర్శించారు. ఆమె కుమారుడు గణేష్‌ శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందారు. దీంతో మంత్రి ఆ గ్రామానికి వెళ్లి, మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ సర్పంచ్‌ మిస్కా రమణ, విశాఖ డెయిరీ డైరెక్టర్‌ మలసాల రమణారావు, అనకాపల్లి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ నాయకులు వియ్యపు భూలోకనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలకు ముగ్గురు ఎంపిక



ఆంగ్ల వక్తృత్వ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కశింకోట: మండలంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి ఆంగ్ల వక్తృత్వ పోటీలకు ఎంపికయ్యారు. కశింకోటలోని బాలికల హైస్కూలులో మండల స్థాయిలో వక్తృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో టెన్త్‌ చదువుతున్న తాళ్లపాలెం హైస్కూలుకు చెందిన కె.యామిని, కశింకోట బాలికోన్నత పాఠశాల విద్యార్థిని రెడ్డి సాహిత్య, వెదురుపర్తి హైస్కూలుకి చెందిన దుర్గాప్రసాద్‌ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. ఈ మేరకు వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెలలో విశాఖలో జిల్లా స్థాయిలో జరిగే వక్తృత్వ పోటీల్లో పాల్గొంటారు. వీరికి మండల స్థాయిలో గెలుచుకున్న బహుమతులను ఇన్‌చార్జి హెచ్‌ఎం గంటా శశికళ అందజేశారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు



మహిళకు గ్యాస్‌ కనెక్షన్‌ను అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్‌: పేదల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో శంకరం, బట్లపూడి గ్రామాల్లో శనివారం వికసిత్‌ భారత సంకల్పయాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉజ్వల పథకం కింద గ్యాస్‌కనెక్షన్లు, వ్యవసాయ డ్రోన్లు అందించినట్టు తెలిపారు. అంతకుముందు మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్‌ అంబేడ్కర్‌ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో ఎ.హేమంత్‌, ఈవోఆర్డీ ధర్మారావు, శంకరం గ్రామ సర్పంచ్‌ పసుపులేటి లక్ష్మి, బట్లపూడి సర్పంచ్‌ గొంతిన సాజావతి, ఎంపీటీసీ ముమ్మిన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పసుపులేటి రామకృష్ణ, గొంతిన సత్యారావు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

డీఎల్‌ఎస్‌ఏతో న్యాయపరమైన సాయం



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు శ్రీవిద్య, గంగరాజు

అనకాపల్లిటౌన్‌: న్యాయపరమైన సహాయం కోసం డీఎల్‌ఎస్‌ఏను సంప్రదించాలని పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్‌.శ్రీవిద్య, ప్రిన్సిపల్‌ సీనియర్‌ సివిల్‌జడ్జి జి.గంగరాజు అన్నారు. స్థానిక ఓ హోటల్‌లో జిల్లా లీగల్‌ సర్వీస్‌ అథారిటీ, స్వాతి మహిళాసంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చట్టపరమైన అంశాలపై మహిళలు దగ్గరలో ఉన్న పోలీస్‌ అధికారులను కలిసి సహాయం పొందవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకుంటే నేరాలను నియంత్రించవచ్చని వారు తెలిపారు. జిల్లా క్రైం అడిషనల్‌ ఎస్పీ జి.సత్యనారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణకోసం ప్రత్యేక చట్టాలు అమలు చేసిందన్నారు. దిశయాప్‌ ద్వారా మహిళలు ప్రస్తుతం పూర్తిస్థాయిలో రక్షణ కలుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వి.సుబ్బరాజు, ట్రైనీ డీఎస్పీ భవ్యరెడ్డి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సాయి లక్ష్మణ్‌, ఎస్‌పీడీఎస్‌ కార్యదర్శి కర్రి జోగినాయుడు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రూ.59 లక్షలతో పార్కు అభివృద్ధి



బోరు పనులు ప్రారంభిస్తున్న సునీత

అనకాపల్లిటౌన్‌: స్థానిక శారదానది ఒడ్డున గల శాంతి పార్కును రూ.59 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్టు 82వ వార్డు కార్పొరేటర్‌ మందపాటి సునీత తెలిపారు. పార్కు ఆవరణలో బోరు నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కు పనులకు మహా విశాఖ నగరపాలక సంస్థ రూ.49 లక్షలు, ఎంపీ సత్యవతి కోటా నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జీవీఎంసీ పబ్లిక్‌ హెల్త్‌ విభాగం ఎస్‌ఈ పి.గణపతిరావు, ఈఈ టి.రాయుల్‌బాబు, డీఈ బి.మహేష్‌, ఏఈ మణికంఠ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్‌, పార్టీ నాయకులు కోన ఉమ, పేలూరి కల్యాణ్‌, డొంక సత్తిబాబు, మేడిశెట్టి గణేష్‌ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అనకాపల్లిటౌన్‌: సామాజిక మార్పులను అర్థం చేసుకుంటూ ఆచరణాత్మకంగా విద్యార్థులు ముందుకుసాగాలని జిల్లా పదవ అదనపు న్యాయమూర్తి ఎస్‌.శ్రీవిద్య సూచించారు. స్థానిక 'డైట్‌' కళాశాలలో శనివారం జరిగిన జాతీయ రాజ్యాంగ దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. న్యాయమూర్తులు జి.గంగరాజు, పి.ప్రదీపలు మాట్లాడుతూ తల్లిదండ్రుల త్యాగాలను అర్థం చేసుకోవడం ద్వారా అర్థవంతమైన జీవితాన్ని గడపడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. అంతకుముందు కళాశాల చైర్మన్‌ దాడి రత్నాకర్‌ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ ఆర్‌.వైకుంఠరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్ద గుమ్మం వద్ద ఫ్యామిలీ డాక్టర్‌

కశింకోట: స్థానిక గవరపేట పెద్ద గుమ్మం వద్ద శనివారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి, మందులుఅందజేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కస్పావీధిలో వైఎస్సార్‌ సీపీ అనకాపల్లి పార్లమెంట్‌ పరిశీలకుడు దాడి రత్నాకర్‌కు సత్కారం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ విగ్రహం

కశింకోట: స్థానిక కస్పావీధిలో గల పంచముఖ అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూల దండలతో అలంకరించి, పూజలు చేశారు. వైఎస్సార్‌ సీపీ అనకాపల్లి పార్లమెంట్‌ పరిశీలకుడు దాడి రత్నాకర్‌ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వేయిదళంల ప్రసాద్‌, నిర్వాహకులు దాసరి బాబు, మరిశా శివ, అధికారి లక్ష్మీపతిరాజు, బొబ్బిలి పవన్‌కుమార్‌, బొబ్బిలి అభిరాం, ఎంపీటీసీ మాజీ సభ్యులు వేగి దొరబాబు, దాడి కృష్ణ, వైఎస్సార్‌ సీపీ నాయకుడు కోయిలాడ నాగు, వేగి పవన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారులకు అభినందన



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జయవీర్‌, అసోసియేషన్‌ సభ్యులు

అనకాపల్లిటౌన్‌: ఖోఖో పోటీల్లో జిల్లా క్రీడాకారులు మరింతగా రాణించాలని ఉమ్మడి విశాఖజిల్లా ఖోఖో అసోసియేషన్‌ అధ్యక్షుడు దాడి జయవీర్‌ అన్నారు. అంతర్‌జిల్లాల 32వ రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్‌ విభాగంలో ఎంపికైన క్రీడాకారులను స్థానిక రింగ్‌రోడ్డు వద్ద దాడి కార్యాలయంలో శనివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26, 27, 28 తేదీల్లో గుంటూరుజిల్లా నర్సారావుపేటలో జరిగే ఖోఖో పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ సభ్యులు దాడి శ్యాంప్రసాద్‌, కర్రి సూర్యనారాయణ, పీలా వీరునాయుడు, జయబాబు, లక్ష్మీ, చిరంజీవి పాల్గొన్నారు.

లింగ వివక్షను విడనాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు,ఉద్యోగులు



లింగ వివక్షకు వ్యతిరేకంగా మహిళలతో ప్రమాణం చేయిస్తున్న వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు

అనకాపల్లి రూరల్‌: లింగ వివక్ష సమాజానికి మంచిది కాదని, అందరూ దానిని రూపుమాపేందుకు కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శోభారాణి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం పట్టణంలోని డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్‌ కూడలి వరకు ఉద్యోగులతో లింగవివక్షకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. కూతురైన, కొడుకైనా అన్ని విషయాల్లో సమానంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఎలాంటి తారతమ్యం చూపకుండా వారి సంరక్షణ చేపడామని తెలియజేసేలా ప్రతిజ్ఞ చేయించారు. స్త్రీలపై గృహ హింస, బలవంతపు బాల్య వివాహాలు చేయడం వంటివాటిని అందరూ వ్యతిరేకించాలని ర్యాలీలో నినాదాలు చేశారు. మహిళలు తమ హక్కుల కోసం మాట్లాడినపుడు, హింస నుంచి బయటపడినపుడు వారిని గౌరవంగా చూడాలని పీడీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఏపీఎం నీలాచలం, పలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట: మండలకేంద్రం కశింకోటలోని స్వయం సహాయక సంఘాల మహిళలు లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రమాణం చేశారు. స్థానిక నూకాంబిక ఆలయం వద్ద స్వయం సహాయక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో వెలుగు ఎంపీఎం ఎస్‌. శ్రీనివాసరావు ప్రమాణం చేయించారు. ఆడ పిల్లలు, మగ పిల్లలు అనే వివక్ష లేకుండా సమానంగా పెంచి ప్రయోజకులను చేస్తామని ప్రమాణం చేశారు. లింగ ఆధారిత హింసను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ పంపిణీ



విద్యార్థినికి మెటీరియల్‌ అందిస్తున్న గొర్లి సూరిబాబు



విజ్ఞానశాస్త్ర ప్రదర్శనను పరిశీలిస్తున్న సూరిబాబు

అనకాపల్లిటౌన్‌: మండలంలో తారకరామాకాలనీ జెడ్పీహైస్కూల్‌లో 32 మంది పదవ తరగతి విద్యార్థులకు రూ.15వేల విలువ చేసే స్టడీమెటీరియల్‌ను ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం అందజేశారు. స్కూల్‌ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉపకరించే ఇటువంటి కార్యక్రమాల నిర్వహణతో ఆనందం కలుగుతుందన్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలో ఉంచిన పలు నమూనాలను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్‌ అమిటి ధనలక్ష్మి, అంజిలిన రాజశేఖర్‌, పంతం శ్రీనివాసరావు, అక్కిరెడ్డి శ్రీను, బొండా అప్పారావు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడాలి



వైఎస్సార్‌ కూడలి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

యలమంచిలి(అనకాపల్లి రూరల్‌): మతసామరస్యాన్ని కాపాడేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పి.చంద్రశేఖర్‌ తెలిపారు. జాతీయ మతసామరస్య వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మతసామరస్యం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కుటుంబ సభ్యులను కోల్పోయి అనాథలైన పిల్లల సంరక్షణకు విద్యార్థులు స్థానిక వ్యాపారుల నుంచి విరాళాలు సేకరించారు. కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు చిట్టిబాబు,అర్జున అప్పారావు మాట్లాడుతూ మతకల్లోలాల సమయంలో బాధిత బాలల వికాసానికి ఈ నిధులను ఉపయోగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ రేఖా రామారావు, మహిళా పోలీసు సంతోషికుమారి పాల్గొన్నారు.